క్లుప్తంగా

వేగంగా నాడు-నేడు పనులు



సామర్లకోట జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో పనులను పరిశీలించిన డీఈఓ తదితరులు

సామర్లకోట: నాడు–నేడు పనులను గడువులో పుగా పూర్తి చేయాలని విద్యాశాఖ డీఈఓ రమేష్ అన్నారు. శుక్రవారం బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు– నేడు పనులను ఆయన పరిశీలించారు. ప్రతీ రోజు పాఠశాలలో జరుగుతున్న పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిపోర్టు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికాధికారి వై.శివ రామకృష్ణయ్య, హెచ్‌ఎం మీనామాధురి పాల్గొన్నారు.

ఉపాధి కోసమే కుట్టుశిక్షణ



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న పీడీ శ్రీరమణి

సామర్లకోట: ఉప ప్రణాళిక ప్రాంతంలోని యువతుల జీవనోపాధుల పెంపుదలకు ఇస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో వెనుబడిన ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి వారికి కుట్టుశిక్షణను టీటీడీసీలో శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న మహిళలకు ఉపాధి కోసం శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించారన్నారు. ఈ మేరకు ఉత్సాహం ఉన్న యువతులను ఎంపిక చేసి వారికి 30 రోజుల పాటు స్థానిక టీటీడీసీలో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ సంకల్ప నిధులతో వీరికి శిక్షణ ఇచ్చి జీవనోపాధుల పెంపుదలకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ క్రాంతి పథకం డీపీఎంలు బాబురావు, రాయ్, భరత్ పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ఫ్యాకల్టీ రాణి కుట్టుశిక్షణ ఇస్తున్నారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి



రైతు శిక్షణలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దాపురం: రైతులు అధిక దిగుబడులు సాధించే దిశగా కృషి చేయాలని వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు, సలహాలివ్వాలన్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించేలా తగు సూచనలిచ్చి రైతులకు అందుబాటులో సేవలందించాలన్నారు. అనంతరం ఎండాకు తెగులుపై సాంకేతిక బులెటిన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సీహెచ్ వెంకటనరసింహరావు, సుధీర్‌కుమార్, సీతారామశర్మ, దక్షిణమూర్తి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ ఏఎస్పీ ప్రేమ్ కాజల్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏఎస్పీ ప్రేమ్ కాజల్

పిఠాపురం: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఏఎస్పీ పి.ప్రేమ్ కాజల్ విద్యార్థులకు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ సీఐ నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తుని: స్థానిక పాయకరావుపేట– గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలు ఢీకొనడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమస్యల రహిత గ్రామాలే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రాపర్తిలో గడప గడపకూ..



రాపర్తిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి సమస్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, వారికే నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలం రాపర్తిలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలసి గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ప్రతీ ఇంటికి వెళ్లిన ఆయన ఆయా గృహాల్లో ఎవరికి ఏ పథకం అందింది అందరికి కలిపి ఎన్ని పథకాలు అందాయో లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి గ్రామం మున్సిపాలిటీల్లోను సచివాలయాల ఏర్పాటు ద్వారా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఇప్పటికే మంచి ఫలితాలు సాధించిందన్నారు. ఏ ఒక్కరికి లేదనకుండా ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత ఒక సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోషక విలువలతో మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

పిఠాపురం: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని పిల్లలందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. గొల్లప్రోలు మండలంలో శుక్రవారం పర్యటించిన ఆమె తాటిపర్తి జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2023–24 పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు వివిధ ప్రశ్నలు వేసి ప్రగతిని పరిశీలించారు. ఆమె వెంట ఎంఈఓలు వెంకటేశ్వరరావు, బీవీఎస్ ప్రసాద్ తదితరులున్నారు.

ఎంఈఓ పరిశీలన

సామర్లకోట: విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు మన్యం, బెండపూడి నుంచి సరఫరా అవుతున్న మధ్యాహ్న భోజనం పోషక విలువలతో ఉందని మండల విద్యాశాఖాధికారి వై.శివరామ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కొన్ని పత్రికల్లో పాఠశాలలో భోజనం నాసిరకంగా ఉందని, కుళ్లిపోయిన గుడ్లు వస్తున్నాయనే కథనాలు ప్రచురితం కావడంతో భోజనాలు తనిఖీ చేశామన్నారు. ఏజెన్సీ నుంచి జిల్లాలో అనేక ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని హైస్కూళ్లకు ఈ సంస్థ నుంచే భోజనాలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఏ పాఠశాలలోను మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు రాలేదని చెప్పారు. శుక్రవారం రైస్, పప్పు తోటకూర, కోడి గుడ్లు ఇచ్చారన్నారు. 421 మంది విద్యార్థులు భోజనాలు చేశారని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మీనామాధురి పాల్గొన్నారు.

అవార్డుతో ఉప్పాడకు మరింత గుర్తింపు



డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును సంఘ సభ్యులకు అందిస్తున్న జాన్ తదితరులు



పురస్కారంలో భాగంగా అందుకున్న మెమెంటో, ప్రశంసాపత్రం

- మండల సచివాలయాల కన్వీనర్ జాన్

కొత్తపల్లి: డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంటు అవార్డు ఉప్పాడ చేనేత సొసైటీకి రావడం ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకువచ్చిందని మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో ఉన్న చేనేత సహకార పరపతి సంఘంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీకి దక్కిన అవార్డును, సొసైటీ అభివృద్ధికి అందించిన రూ.10 లక్షల చెక్కును చేనేత జౌళిశాఖ అధికారులు సొసైటీ సభ్యులకు అందజేశారు. జాన్ మాట్లాడుతూ చేనేత కళా నైపుణ్యం చాలా అద్భుతమన్నారు. ఈ సొసైటీ మరింత అభివృద్ధి సాధించేందుకు సభ్యులు కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేనేత రంగం, కార్మికులను పట్టించుకోలేదని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికీ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలను తమ ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు. సంఘాలను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో అవార్డులు ప్రకటించడం గర్వకారణమన్నారు. జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి పెద్దిరాజు మాట్లాడుతూ ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జౌళిశాఖ అధికారి చేతన్, మాస్టర్ వీవర్ లొల్ల సత్యనారాయణ, ఆసపు విశ్వేశ్వరరావు, చేనేత కార్మికులు భగవాన్, దాసరి బాలాజీ, కొత్తపల్లి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు యర్రా శ్రీనివాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటి బిల్వార్చనకు సర్వం సిద్ధం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు ఎదురుగా ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో శనివారం నిర్వహించే కోటి బిల్వార్చన, పడి పూజలకు సర్వం సిద్ధమైంది. తుని, పాయకరావుపేట అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులు, వలంటీర్లు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. మరో పక్క వలంటీర్లు బిల్వాలు, కొబ్బరికాయల సేకరణ, శుద్ధి చేసే పనులు చురుగ్గా చేస్తున్నారు. 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులు, మరో ఐదు వేల సాధారణ భక్తులు కోటి బిల్వార్చనలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మాలధారణ భక్తులు స్నానాలు ఆచరించేందుకు, వాహనాలు పార్కింగ్ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్



పీబీ దేవంలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో దోమల నివారణకు శుక్రవారం రాత్రి నుంచి ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభించినట్టు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్‌తెలిపారు. గ్రామంలో వరికోతలు ప్రారంభం కావడంతో ఇళ్లలో దోమల బెడద పెరిగే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూర్యారావు సూచనల మేరకు ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు.

కొట్లాట కేసులో రూ.8 వేల జరిమానా

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై జూన్ 2, 2021 జరిగిన కొట్లాట కేసుకు సంబంధించి నేరస్తుడికి కోర్టు రూ.ఎనిమిది వేల జరిమానా విధించినట్టు శుక్రవారం సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. చెరువు గట్టుపై గేదెలు కట్టే విషయంపై ఎడ్ల శ్రీను, మచ్చ మునలయ్యకు ఘర్షణ జరిగిందన్నారు. మునలయ్య బీరు బాటిల్‌తో ఎడ్ల శ్రీనును పొడవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. అప్పటి ఎస్సై అభిమన్యు దర్యాప్తు చేసి కేసు నమోదు చేశారని తెలిపారు. కాకినాడ స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఉషాలక్ష్మీకుమారి నేరస్తుడికి రూ.ఎనిమిది వేల జరిమానా విధించారని వివరించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ విజయ వాదించారన్నారు. సాక్షులను కోర్టు కానిస్టేబుల్ పి.శివప్రసాద్ హాజరుపరిచినట్టు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకున్న వీధి నాటకం



వాలి, సుగ్రీవుడి యుద్ధం వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కళాకారులు వాలి సుగ్రీవుని యుద్ధం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో వాలిగా కోనిబోని రాజు, సుగ్రీవునిగా ఇసరపు రాజు, ఆంజనేయుడిగా గొనగాని శ్రీను, రాముడిగా గొనగాని సత్తిబాబు, లక్ష్మణుడిగా గొనగాని నానాజీ, చిన్న ఆంజనేయుడిగా అమరపల్లి బాలు, తారగా బుద్దాల ముసిలి నటించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్–డ్రెసింగ్ చేశారు.

దేశ చరిత్రలో నూతన అధ్యాయం జగనన్న ఆరోగ్య సురక్ష

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ అరుణ



మందుల కిట్లు అందజేస్తున్న ఛైర్‌పర్సన్ అరుణ, కమిషనర్ తదితరులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశ చరిత్రలోనే నూతన అధ్యాయమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక గాంధీచౌక్‌లోని రైతు భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ మేరకు శిబిరానికి వచ్చిన వారికి జరుగుతున్న వైద్య పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడానికి ప్రతి వార్డులోనూ వలంటీర్లు, హెల్త్ సిబ్బందితో సర్వే చేయించారన్నారు. ఆయా కుటుంబాల్లో అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో వైద్య చేయిస్తామని చెప్పారు. ఈ క్యాంప్‌లో వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు ఇస్తామన్నారు. అవసరమైన వారికి కార్పొరేట్ వైద్యం అందించే అవకాశం ఉందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ ఛైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, డాక్టర్లు సంజీవ్, జ్యోతి, భవ్య వైద్య సేవలందించారు. పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసు పాల్గొన్నారు. ఆరోగ్య మిత్ర బంగారుశ్రీ ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న ఫలితాలను వివరించారు. ఆరోగ్య శిబిరంలో రోగులకు అందుతున్న సేవలను ఛైర్ పర్సన్ పరిశీలించారు.

గొంచాలలో సామూహిక కుంకుమ పూజలు



గొంచాల గ్రామంలో పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు గ్రామ కనకదుర్గ ఆలయంలో స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచార వారోత్సవాలలో భాగంగా ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పారాయణ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, సత్యనారాయణమూర్తి, అల్లాకి రాజాల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు, కుంకుమ పూజలు జరిగాయి. గ్రామంలోని అనేక మంది మహిళలు పాల్గొన్నారు. శనివారం కాపవరంలోను, 5న వేట్లపాలెంలోను, ఆరున హుస్సేన్‌పురంలోను ఏడున వికె రాయపురం గ్రామంలోను, 8న నవర గ్రామంలోను ధర్మ ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ నాగమల్లేశ్వరరావు వివరించారు. ఈ మేరకు పారాయణలు, కుంకుమ పూజలు, భజనలు, కోలాటం కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలనిఈఓ పిలుపు నిచ్చారు.

ప్రమాదం జరిగేదాకా ఇంతేనేమో!



పిఠాపురం–ఉప్పాడ రహదారి మధ్య నిర్లక్ష్యంగా వదిలేసిన పైప్‌లైన్ గొయ్యి



ఎత్తుతూము సమీపంలో రహదారిపై అడ్డంగా ఉన్న గోతిలో నుంచి తీసిన మట్టి

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ఎత్తుతూము సమీపంలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి వదిలేశారు. ప్రధాన రహదారి మధ్య ఉన్న పైపులైన్ లీకు కావడంతో నెల రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గొయ్యి తీసి మరమ్మతులు చేసి పూడ్చకుండా వెళ్లిపోయారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గొయ్యి మలుపులో ఉండడం వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలి

సామర్లకోట: ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ గోవిందు అన్నారు. మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని సిబ్బందికి శుక్రవారం స్థానిక టీటీడీసీలో ఆయన శిక్షణ నిర్వహించారు. రైతులకు ధాన్యం తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండరాదని తెలియజేయాలన్నారు. ఈ మేరకు ధాన్యం కోత అయిన తరువాత రెండురోజుల పాటు ఆరబెట్టుకునే విధంగా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి హమాలీస్ చార్జిలతో పాటు రవాణా ఖర్చులను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందని చెప్పారు. ఈ మేరకు రైతులు ముందుగా పెట్టుబడి పెట్టుకోవలసి ఉంటుందని, రైతులలో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం పట్టుబడికి సంబంధించి సంచులు రైతు భరోసా కేంద్రం నుంచి రైతులకు అందజేస్తామని చెప్పారు. ధాన్యం రవాణాకు సంబంధించి ప్రతీ గ్రామంలోను జీపీఎస్ పరికరాలు అమర్చిన వాహనాలను గుర్తించామని, వాటిలో మాత్రమే రైతులు ధాన్యం రవాణా చేయవలసి ఉంటుందని చెప్పారు. దీనివలన మిల్లులో వాహనం ఎక్కువ సమయం నిలిచిపోతే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. మండల డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితాలో సవరణ

సామర్లకోట: మండల పరిధిలో ఉన్న ప్రతీ పోలింగ్ కేంద్రంలోను శని, ఆదివారాలల్లో రెండు రోజుల పాటు ఓటర్ల జాబితాలో సవరణలు చేస్తామని తహసీల్దార్ ఎస్‌ఎల్‌వీ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే తుది ఓటర్ల జాబితాలు తయారు అయ్యాన్నారు.

ఓటు ఇక వెరీ స్మార్ట్

- కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు
- స్మార్ట్‌ఫోన్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ చాలు
- మీ ఓటు వివరాలు మీ చేతిలో ఉన్నట్టే



ఓటు నమోదుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొబైల్ యాప్ పోస్టర్

కాకినాడ సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వస్తుంది. అందుకు ఆ వ్యక్తి ముందుగా ఓటరుగా నమోదు కావాలి. ఇందుకోసం ఏ కార్యాలయానికీ కాళ్లరిగేలా తిరగక్కర్లేదు. చేతిలో స్మార్ట్ ఫోన్, అందులో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ఉంటే చాలు. ఆ యాప్‌లో నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు అన్నీ ఎవరికి వారే చేసుకోవచ్చు. ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 1637 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఆ కేంద్రాల పరిధిలో 15,89,755 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికీ ఆ జాబితాలో పేరు లేనివారు ఆ యాప్ ద్వారా ఓటు కోసం నమోదు చేసుకోవచ్చు.

గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్..

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అక్కడ భాషను ఎంచుకుని రిజిస్టర్ చేసుకోవాలి. తరువాత మీ ఓటు ఉందో లేదో పలు మార్గాల ద్వారా చెక్ చేసుకోవచ్చు.

బార్ కోడ్ స్కానింగ్

పాత ఓటరు కార్డు ముందు భాగంలో బార్‌కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని బార్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని కార్డుపై ఉన్న బార్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు వస్తాయి.

క్యూఆర్ కోడ్ స్కానింగ్

కొత్త ఓటరు కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని క్యూ ఆర్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు తెలుస్తాయి.

వివరాలు అన్ని నమోదు చేసి

రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ఓటరు కార్డులో ఉన్న వివరాలు నమోదు చేయాలి. తండ్రి పేరు, వయస్సు, లింగం, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు గురించి తెలుసుకోవచ్చు.

వెబ్‌సైట్ ద్వారా ఇలా..

ఓటర్లు సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఓటుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈవో ఆంధ్రా.ఎన్‌ఐసీ.ఇన్, కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్, ఓటర్స్.ఈసీఐ.జీవోవీ.ఇన్‌లలో చెక్ చేసుకోవచ్చు. ఇంకా సందేహాలుంటే 1950 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు తీసుకోవచ్చు.

ఓటరు కార్డు నంబరుతో

ప్రతి ఓటు కార్డుకు నంబరు ఉంటుంది. నెంబర్ ఆప్షన్ ఎంచుకుని మీ కార్డు నంబర్ నమోదు చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు ఫారం

కొత్త ఓటరుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లు, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు.

తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం



తాజాగా విడుదలైన ఓటరు ముసాయిదా జాబితాలో వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ఆన్‌లైన్‌లోనే సరి చూసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మీ వివరాలు నమోదు చేస్తే యాప్‌లో డిస్‌ప్లే అవుతుంది. ఏమైనా తప్పులుంటే మళ్లీ సరిదిద్దుకునేందుకు కూడా అవకాశం ఉంది. దీనిపై ఈ నెల, డిసెంబర్ నెలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం.

– డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎన్నికల అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్.

రేపటి నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు

పెద్దాపురం: సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు ఆదివారం నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మరిడమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు అమరేశ్వర ఘనపాఠి, అర్చకులు కోట వంశీ, యడవిల్లి ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.